# ఎడారి కోయిల

కాకినాడ నుంచీ విజయవాడమీదుగా తిరుపతికి వెళ్ళే తిరుమలా ఎక్స్‌ప్రెస్ ఉదయం 7-15కు సరిగ్గా గమ్యస్థానం చేరుకుంది. పంపులోంచి నీళ్ళుదూకి నట్టు ప్రయాణీకులందరూ పెట్టెల్లోనుంచి ఒక్కపెట్టున ఈవల పడి తోసుకుంటూ, తప్పుకుంటూ ముఖద్వారంవైపు వెళ్ళిపోయారు. కోలాహలమంతా సద్దుమణగడానికి ఇంచుమించు పదిపదిహేను నిముషాలు పట్టింది. దాదాపుగా ఖాళీ అయిపోవస్తున్న ప్లాట్‌ఫారం పైన ఒక పదిహేడు-పద్దెనిమిది సంవత్సరాల పడుచువాడు మాత్రం నింపాదిగా నిలబడిపోయాడు. అతను పాంటుపైన అరచేతుల చొక్కా తొడుక్కున్నాడు. కళ్ళకు వెడల్పాటి అద్దాలు పెట్టుకున్నాడు. వేషాన్ని బట్టి చూస్తే అతనిలో ప్రత్యేకత ఏదీ లేదనే చెప్పాలి. కానీ, ఎరుపూ, తెలుపూ సమపాళంగా కలిసిన దేహచ్ఛాయ, కాంతులు చిప్పిల్లుతున్న కళ్ళు, దువ్వకపోయినా దువ్వినట్టే ఉన్న నొక్కుల క్రాపింగు అతని ఆకారానికొక హుందాతన్నాన్ని ఆపాదిస్తున్నాయి. విలక్షణత ఏమిటంటే, ప్రయాణికులకు సహజమైన తొందర పాటు అతనిలో కానరావడం లేదు. 'ఓహో! ఇదేనా తిరుపతి?' అన్నట్టుగా అతని చూపులు పరిసరాల్లోకి చొచ్చుకు పోతున్నాయి. తిరుపతి పట్టణం తాలూకు స్థూల స్వరూపం గోచరం గాకపోయినా, గోవిందరాజస్వామి గుడిలోని ధ్వజస్తంభపు ఘంటారావాలు, కొత్తసత్రాలవైపునుంచీ గాలిలో తేలివస్తున్న సుప్రభాత గీతాలు, పక్క రోడ్డు మీద ఉండి ఉండి చెలరేగుతున్న తమిళదేశపు యాత్రికుల గోవిందనామ నినాదాలు అక్కడికి స్పష్టంగా వినవస్తున్నాయి. 'నిజమే, మన మిప్పుడున్నది తిరుపతిలోనే!' అన్న భావన మనసులో మెరిసి పోయేసరికి అనిర్వచనీయమైన మధుర స్పర్శ ఏదో సోకినట్టుగా ఆ అబ్బాయి దేహం పులకించిపోయింది. కళ్ళు చెమ్మగిల్లాయి. 'స్వామీ, వేంకటాచలపతీ! తిరుపతిలో దిగిన వెంటనే భక్తులందరూ రెక్కలు గట్టుకున్నట్టుగా వచ్చి నీ సన్నిధిలో వాలిపోతారట! అలా చేయలేక పోతున్నందుకు నన్ను మన్నించు. చరిత్రకందని కాలం నుంచీ నువ్వీ కొండపైనే ఉన్నావు. ఇంకా ప్రపంచమున్నంతకాలమూ ఉంటావు. నిన్ను దర్శించుకోడానికి నా కింకో రెండు మూడు రోజులు మాత్రం గడువివ్వు' అనుకున్నాడు. ఆ పారవశ్యంలో అతడెంత సేపలా ఉండిపోయేవాడో చెప్పలేము. ఇంతలో ఏడెనిమిదేళ్ళ కాన్వెంటు అమ్మాయి ఒకతె ప్లాట్‌ఫారం మీదినుంచీ బ్రిడ్జివైపు నడిచివెళ్తూ, ఆ పడుచువాడి భుజంనుంచీ వ్రేలాడుతున్న ఎయిర్ బ్యాగుపైన ప్లాస్టిక్ కాగితంలోంచి కనిపిస్తున్న అక్షరాలను కూడి కూడి 'రవిబాబు' అంటూ బిగ్గరగా చదివేసింది. కొత్త చోట

హఠాత్తుగా తనపేరు వినిపించేసరికి ఆ కుర్రవాడు కొద్దిగా విచలితుడైపోయాడు. ఎయిర్‌బాగును ఎడమభుజం నుంచి కుడి భుజం పైకి మార్చుకుంటూ చరచరా ముందుకు నడిచి, టికెట్టును టి.సి. చేతిలో పడవేసి, రెండో తరగతి ప్రయాణికుల వెయిటింగు హాలుగుండా గబగబా రోడ్డుపైకి వచ్చేశాడు.

"ఏం బాబూ! కొండపైకేనా? టికెట్టు పన్నెండు రూపాయలు. టాక్సీ ఉంది..." అంటూ ఒక దళారీ అతన్ని సమీపించాడు.

"కొండ... పైకి కాదు. మరి.... నేను..."

రవి బాబు చెప్పదలచుకొన్న మాటలు గొంతులోనుంచి ఊడిపడనేలేదు.

'కొండపైకి కాకపోతే నీతోనాకేం పని?' అన్నట్టుగా దళారీ వ్యక్తి ఒక విసురుతో మరొక వైపుకు జారుకున్నాడు.

కొంతదూరం ముందుకు నడిచి నాలుగురోడ్ల కూడలిలోకి వచ్చి నిలుచున్నాడు రవిబాబు. రైలు దిగిన ప్రయాణికులకోసం అక్కడ వరుసగా కొన్ని హోటళ్ళున్నట్టు పోల్చుకున్నాడు. శ్రీకాళహస్తి దాటుకున్నాక అతను బండిలో పళ్ళయితే తోముకున్నాడుగానీ, ఇంకా కాఫీతోనైనా కడుపు చల్లబరుచుకోలేదు. మధ్యాహ్న భోజనం ఎప్పుడు, ఎక్కడ దొరుకుతుందో, ఆ దొరికే భోజనం ఎలా ఉంటుందో ఊహకందని పరిస్థితి. అతని కాళ్ళు అప్రయత్నంగా అతణ్ణి హోటలు వైపు తీసుకెళ్ళాయి. మెట్లెక్కాడు. ఖాళీ కుర్చీ వెదికి పట్టుకున్నాడు. టిఫిను తెప్పించుకొని తినడానికి ఉపక్రమించాడు. ఏ పనిచేస్తున్నా అతని మనసు మాత్రం తానింక కొద్దిసేపట్లో ప్రారంభించబోతున్న వాయేజ్ (సాహసయాత్ర) చుట్టే పరిభ్రమిస్తూ ఉండిపోయింది.

వాయేజంటే జ్ఞప్తికి వచ్చింది. ప్రైమరీ స్కూల్లో చదువుతూ ఉండిన రోజుల్లో రవిబాబు పెద్దటైపులో అచ్చైన 'వాయేజెస్ ఆఫ్ సింద్‌బాద్' అన్న పుస్తకం చదివాడు. 'రాబిన్‌సన్ క్రూసో' సాహసయాత్రలని గురించి చదివాడు. 'గలివర్ ట్రావెల్స్' అనే నావికుడికి మహాకాయుల దేశంలోనూ, అల్పకాయుల దేశంలోనూ ఎదురైన ఇక్కట్లను గురించి చదివాడు. కొంచెం పెద్దవాడై ఉన్నత పాఠశాలలో ప్రవేశించాక నిస్సారమైన ఎడారులతోను, దుర్గమారణ్యాలతోను, జలపాతాల తోను నిండిన చీకటి ఖండంలోకి చొచ్చుకుపోయి దాని అంతు కనిపెట్టిన పరిశోధకుల్ని గురించి 'ఎక్స్‌ప్లోరేషన్ ఆఫ్ ది డార్క్ కాంటినెంట్' అన్న పుస్తకాన్ని చదివాడు. సహనానికీ, సాహస ప్రవృత్తికీ ఒక తీరని పరీక్షగా మిగిలిపోయిన మంచు కొండపైన మానవుడి విజయాలను గురించి 'కాంక్వెస్ట్ ఆఫ్ ది హిమాలయాస్' అన్న పుస్తకం ద్వారా తెలుసుకున్నాడు. అయితే ఇవన్నీ ఒక ఎత్తు– పబ్లిక్ స్కూల్లో పంతులమ్మ మేరీ క్రిస్టినా చెప్పిన 'ఎలెక్స్ హేలీ' కథ మాత్రమే ఒక ఎత్తు.

ది ఏంజెల్స్ ఎజుకేషన్ సొసైటీ వారి పబ్లిక్ స్కూల్లో పై తరగతులకు చరిత్ర పాఠాలు చెప్పే నీగ్రో పంతులమ్మ మేరీ క్రిస్టినా. హిస్టరీ మాత్రమే గాక ఆమె ప్రతి శుక్రవారం చివరి పీరియడ్‌లో తమకు మోరల్‌క్లాస్ కూడా హాండిల్ చేస్తుండేది. బోలెడన్ని నీతి కథలు ఏకరువుపెట్టి వాటితో

తానూ, తన విద్యార్థులూ గూడా విసిగిపోయిన తరువాత ఆమె 'ఈసారి ఒక నిజమైన కథ చెబుతాను వినండి' అంటూ ఎలెక్స్ హేలీ కథ మొదలు పెట్టింది.

అమాయకులైన నీగ్రో జనుల్ని వివిధ మాయోపాయాల ద్వారా బంధించి, కాళ్లకూ, చేతులకూ గొలుసులు తగిలించి, అట్లాంటిక్ మహా సముద్రంపైన ఆఫ్రికానుంచీ అమెరికాకు రవాణాచేసే బానిసల వ్యాపారం పదిహేడవ శతాబ్ది ప్రథమ పాదంలో ప్రారంభమైంది. సంతలో గొడ్లను అమ్మినట్లుగా నల్లజాతి స్త్రీ పురుషుల్ని తెల్లజాతి కామందుల పరం చేసే తతంగమే బానిసల వ్యాపారం. ఆ ఉప్పెనలో ఇప్పటికి రెండు వందల సంవత్సరాల క్రితం అమెరికా నేలపైకి కొట్టుకొచ్చిన ఒక నికృష్టజీవి కుంటా కిండే. స్వదేశానికీ, స్వగ్రామానికీ, స్వజనానికీ దూరంగా అటు గతంగానీ, ఇటు భవిష్యత్తుగానీ లేని ఒక దౌర్భాగ్య జీవిత యాతనలో ఇమడలేక కుంటా కిండే ఎన్నోసార్లు పారిపోయే దుస్సాహసానికి పూనుకున్నాడు. వేటకుక్కల్ని ఉసికొలిపి ప్రతిసారీ పలాయితుణ్ణి చేజిక్కించుకుంటూ వచ్చిన తెల్లవాళ్లు, ఒంటిపైన గుడ్డలన్నీ ఒలిచేసి చర్మంచిట్లే దాకా కొరడాలతో కొట్టారు. చివరికిట్లా కాదని కుడిపాదంలో సగందాకా తెగనరికేశారు. ఇక లాభంలేదని పరిస్థితులతో రాజీపడిపోయిన కుంటా వయసులో తనకంటే పెద్దదాన్ని పెళ్ళాడాడు. వాళ్లకొక ఆడపిల్ల పుట్టింది. ఏదో తప్పు చేసిందన్న ఆరోపణపై పదహారేళ్ళొచ్చిన ఆ పిల్లను తల్లిదండ్రులనుంచీ ఎడం చేసి ఇంకొక కామందుకు అమ్మేశారు. కొత్తకామందుకు ఉంపుడుగత్తెగా ఉంటూ ఆమె ఒక మగబిడ్డకు తల్లయింది. ఈ వరుసలో కుంటా కిండేనుంచీ ఏడవతరానికి చెందినవాడు ఎలెక్స్ హేలీ. ఎన్ని కష్టనష్టా లెదురైనా, ఎన్ని దారుణ హింసలకు లోనైనా ఈ కుంటా కిండే సంతతివాళ్లు తమ ప్రాచీన ఆఫ్రికాభాషలోని కొన్నిపదాలను అదొక వారసత్వపు ఆస్తిలాగా తమ స్మృతులభోషాణంలో పదిలపరచుకుంటూ వచ్చారు. ఆ పొడిమాటల సహాయంతో ఎలెక్స్ హేలీ ఆఫ్రికా ఖండంలోని తన పూర్వీకుల గ్రామాన్ని గుర్తించదలచుకొన్నాడు. ఎందరో భాషావేత్తల్ని సంప్రదించాడు. ఎన్నో గ్రంథాలయాలు శోధించాడు. కొన్ని లక్షలమైళ్లు పయనించాడు. పన్నెండేళ్ళు శ్రమించాడు. ఈ నిర్విరామ పరిశోధనకు ఫలితంగా గాంబియా దేశంలోని 'జఫూర్' అనే పల్లె తన వంశీకుల పూర్వనివాసమై ఉండొచ్చునని ఊహించాడు. విమానంలో వెళ్ళి గాంబియా ముఖ్య నగరమైన బాంజుల్‌లో వాలి, కొంతదూరం నదీమీదా, కొంతదూరం లారీమీదా ప్రయాణం చేసి, అంతటితో ప్రయాణ సదుపాయాలన్నీ బందైపోవడం వల్ల చివరి అంచెలో పాదచారిగానే పయనించి, అతను తన ప్రాచీనులు పుట్టిన గడ్డపైన కాలు మోపుతాడు. ఆ పల్లెవాసులు అతణ్ణి తమ సంతతి వాణ్ణిగా పోల్చుకుని ఆనంద పారవశ్యంతో నృత్యం చేస్తారు. తన ప్రాచీన బంధు సంతతి మధ్య హేలీ గూడా మైమరిచి, తన జన్మ సార్థకమైనట్టు మురిసిపోతాడు.

టిఫిన్ ముగించి, చేతుల్ని కడుక్కుంటూ అనుకున్నాడు రవిబాబు. హేలీకి, తనకూ కొన్ని పోలికలుంటే ఉండొచ్చు. కానీ, తేడాలుసైతం లేకపోలేదు. అమెరికాలో అడుగు పెట్టిన తన

పూర్వీకుడికి హేలి ఏడవ తరంవాడు. తాను రెండవ తరం వాడే. అయితే ఒక విధంగా హేలీ తనకన్నా అదృష్టవంతుడు. వంశ వృక్షపు పాదు ఎక్కడుందో పోల్చుకోడానికి, తన వంశస్థుల ప్రాచీన భాషకు చెందినవైన కొన్ని డజన్ల పదాలు అతనికి తోడ్పడ్డాయి. తనకు దొరికిన ఆధారాలు చాలా తక్కువ. ఆ ఊరికి వెళ్ళాలంటే తిరుపతిలో రైలుదిగి బస్సెక్కాలని తెలుసు. ఆ ఊరి పేరు రాగులపాడని తెలుసు. అదనంగా ఇంకొక ముసలాయన పేరు తెలుసు. అంతకు మించి మరేమీ తెలియదు.

బస్‌స్టేషన్‌కు చేరుకోడమేమంత కష్టమనిపించలేదు రవిబాబుకు. శతాబ్దాల తరబడి యాత్రికులతో వేగుతున్నా స్థానికుల్లో ఇంకా ఎంతో కొంత సౌజన్యం మిగిలి ఉన్నట్టే ఉంది. ఎవరో దారి జూపించారు. ఏమైనా ఇంగ్లీషులో ఆలోచిస్తూ తెలుగులోకి అనువదించుకుని మాట్లాడవలసి ఉండడం మాత్రమే తనకు ఇబ్బందిగా ఉంది. గృహ వ్యవహారాల్లో సైతం తన తల్లిదండ్రులు తెలుగును తోసిరాజన్నారు. ఎప్పుడైనా తన కర్థం కాకూడదన్న విషయాలను గురించి మాత్రం తెలుగులో మాట్లాడేవారు. వాళ్ళలా తనను మభ్యపెట్ట చూసిన కొద్దీ తెలుగు నేర్చుకోవాలన్న పట్టుదల తనలో పెరుగుతూ వచ్చింది. పనిగట్టుకుని వారాంతాల్లో తెలుగు కుటుంబాల పిల్లలతో కలిసిమెలిసి ఉండేవాడు. తమలో తాము తెలుగులోనే మాట్లాడుకోవాలంటూ స్నేహితుల మధ్య ఒక ఒప్పందం చేసుకున్నారు. 'తెలుగూ ఇన్ థర్టీడేస్' అన్న పుస్తకం సంపాదించి అచ్చులు, హల్లులు, గుణింతాలు స్వయంకృషితోనే నేర్చుకున్నాడు. కానీ, ఈ మాత్రపు స్వభాషా పరిజ్ఞానం తన తెలుగుదేశ సంచారానికి ఎంతగా ఉపకరిస్తుందో తెలియరావడం లేదు.

తిరుపతి బస్‌స్టేషన్ రద్దీగా ఉంది. రద్దీగా ఉండడమే తిరుపతి బస్‌స్టేషన్ స్వభావం. వసారాలో నడుస్తూ బస్సుల ముందు వైపు కనిపిస్తున్న ఊళ్ళపేర్లు చదువుకోసాగాడు రవిబాబు. పుత్తూరు, నగరి, మదనపల్లి... ఎన్నడూ విన్నవి కావు. కానీ, చదువుకు పోతుంటే ఏవో పూర్వజన్మ స్మృతులు జ్ఞప్తికొస్తున్నట్టున్నాయి. ఇంతకూ రాగులపాడు బస్సేదీ? వచ్చి వెళ్ళిపోయిందా? లేక ఇకపైన వచ్చి బయల్దేరుతుందా?

ఎంక్వైరీకి వెళ్ళి వాకబు చేశాడు.

"రాగులపాడా? అదెక్కడి ఊరయ్యా బాబూ! ఎప్పుడూ విన్లేదే! ఆ ఊరి కంటూ బస్సులు లేవు. ఏరూట్‌లో ఉందో తెలియదా?"

తల అడ్డంగా తిప్పాడు రవిబాబు, తెలియదు అన్నట్టుగా.

"రాగులపాడు వెళ్ళాలి. అంతే నీకు తెలిసింది? బాగుందయ్యా, బాగుంది. అయితే, వెళ్ళి వాకబు చెయ్యి. దేశం తెలిసిన వాళ్ళూ దేశంమీద తిరిగే వాళ్ళూ చాలామంది ఉంటారు. వాళ్ళ నడిగి తెలుసుకో!"

మళ్ళీ వెయిటింగ్ హాల్లోకి వచ్చాడు రవిబాబు. తనకు తోడ్పడగలిగిన వ్యక్తిని పోల్చుకోడంలో అతనికి అతీంద్రియ జ్ఞానం లాంటిదేదో సహకరించింది. గొడుగు కాడకు గడ్డం అనించుకుని బెంచీపైన కూచున్న ఓ ముసలాయన్ను సమీపించి కుదురుగా అతని పక్కన కూర్చున్నాడు.

"ఏం నాయనా! ఏ బస్సు కోసరం?"

అపరిచితుడైన వ్యక్తి అంత అప్యాయంగా పలకరించడం రవిబాబు పాలిటికి ఒక అపురూపమైన అనుభవమైపోయింది. పోబోతున్న ప్రాణాలు తిరిగి వచ్చి గూట్లోకి చేరుకున్నంత ధైర్యం కలిగింది. ఇలాంటి వ్యక్తుల అసరా గనుక లభిస్తే ఎంత అపరిచిత ప్రదేశాన్నయినా నిరాఘాటంగా తిరిగి రావచ్చుననిపించింది.

"అదేనండీ తెలియడం లేదు. నేను రాగులపాడు వెళ్ళాలి" అన్నాడు రవిబాబు.

"రాగులపాడా? అట్లా జెప్పు! తిరుపతి బస్టాండులో కొచ్చి మద్రాసు, బెంగుళూరు, అయిద్రాబాదు అంటే చెప్పేవాళ్ళుంటారు కానీ, రాగులపాడు, రంగం పేట అంటే చెప్పే వాళ్ళెవురు? నన్నడిగినావు కాబట్టి సరిపోయింది. గాజులబేరం పైన నేను పడమటి గడ్డంతా తిరిగినోణ్ణి. వగళ్ళ,చీనేపల్లి, కలకడ, గుర్రంకొండ - అదంతా నాకు కొట్టిన పిండి. నువు రాగులపాడు పోవాల గదా! చెప్తా నుండు..."

డబ్బిలోనుంచి ఒక చిటికెడు నశ్యం తీసి దట్టించి కొనసాగించాడు ముసలాయన. "నువ్వేం జేస్తావంటే బాకరాపేట దారిలో కడపకెళ్ళే బస్సెక్కి కూచో. కండక్టరుతో 'మాలు, మాలు' అని చెప్పు. దానసలు పేరు మహలో, గిహలో ఏందో అంటారులే. నిన్ను వడ్లమిషను దగ్గర దించేస్తాడు. అక్కణ్ణించి తూరుపు దిక్కుగా జూడు. ఒక మట్టి బాట కనిపిస్తాది. దాన్ని పట్టుకున్నావంటే వక్క కొరికేటంత సేపట్లో నువు రాగులపాడులో ఉంటావు. మరైతే ఒక మాట మాత్తరం మరిచిపోక! కడప బస్సేగదా అనీ కోడూరు, రాజంపేట మార్గంలో పోయే బస్సెక్కినావో, నీ పని గోయింద! మళ్ళా చెప్పలేదనుకోబాక!"

బ్యాగులోనుంచీ కాగితమూ, కలమూ పైకి తీసి, "ఈ వైపు నాకు కొత్త. చెబుతే రాసుకుంటాను" అన్నాడు రవిబాబు.

"సర్లే. రాసీ, రాసీ చదుముకుంటే తప్పా ఈ కాలపు పిల్లకాయలకు ఏదీ గానీ తలకాయలో నిలవదులే! ఆ సంగతి నాకు దెలుసు. సెప్తాను. రాసుకో!"

❖ ❖ ❖

తిరుపతి-కడప (వయా బాకరాపేట, పీలేరు, రాయచోటి) బస్సు తొమ్మిదిన్నరకు సరిగ్గా స్టేషనులోకి వచ్చింది. బస్సెక్కిసీటు చేజిక్కించుకోవడం ఒక వీరోచితకృత్యంగా భావించే వాళ్ళతో పోటీ పడలేకపోవడంతో రవిబాబుకు వెనుక సీటే దక్కింది. స్వదేశంలో దిగిన తరవాత రవిబాబు బస్సు ప్రయాణం చేయడం ఇదే మొదటిసారి. నగర శివార్లు దాటి పది పదిహేను మైళ్ళు వెళ్ళేసరికి రైలు ప్రయాణానికీ, బస్సు ప్రయాణానికీ ఒక స్పష్టమైన తేడా ఉన్నట్టు అతడు గుర్తించాడు. నన్ను ముట్టుకోకు నామాలకాకి అన్నట్టుగా రైలుబండి పట్టాలపైన తన దారిని తాను వెళ్ళిపోతుంది. ఎక్కదలచుకున్నవాళ్ళు అదెక్కడ ఆగుతుందో అక్కడికి వెళ్ళవలసిందే. బస్సు సంగతలా కాదు. అది పొలాలగుండా , తోటలగుండా, బీళ్ళగుండా ప్రతి పల్లెనూ

పలకరిస్తూ, ప్రతి పేటనూ పరామర్శిస్తూ వెళ్తుంది. అందువల్ల బస్సులో ప్రయాణం చేస్తుంటే సూటిగా జనజీవనంలోకి చొచ్చుకుపోయినట్టే ఉంటుంది. రైలు ప్రయాణికులు మాట్లాడుకోవడం తక్కువ. ఒకవేళ మాట్లాడుకున్నా, వాళ్ళకు జాతీయ, అంతర్జాతీయ విషయాలపైనే ఆసక్తి ఉన్నట్టు తోస్తుంది. అందుకు విరుద్ధంగా బస్సులో స్థానిక విశేషాలు చాలా వినిపిస్తున్నాయి- మంగాపురం గుడిలో నైట్‌వాచర్ల హత్య కేసు ఏమైంది? కల్యాణిడాంలో నీటిమట్టం ఎక్కడుంది? బాకరాపేట కనుమలో దారిదోపిడీ చేసిన నేరస్థులు ఎలా పట్టుబడ్డారు? బీటలు వారిన చిన్నగొట్టిగిల్లు చెరువు నిండేదెప్పుడు? రొంపిచెర్ల దగ్గర ప్రభుత్వం వాళ్ళు పెట్టదలుచుకున్న పట్టు పరిశ్రమ కేంద్రంలో ఎందరికి పని ఉంటుంది? పీలేరు మేజరు పంచాయతీ మునిసిపాలిటీ అయ్యేదెప్పుడు?... బస్సు ప్రయాణికుల సంభాషణలో ఇలా ఎన్నెన్నో అంశాలు దొర్లిపోతున్నాయి.

ఎవడో ఒక భావుకుడు అమెరికాలోని పెద్ద నగరాలను కాంక్రీటు కట్టడాల మహారణ్యాలుగా పేర్కొన్నాడు. అలాంటి మహానగరంలో ఆకాశహర్మ్యాల మధ్య పెరిగినవాడు రవిబాబు. అక్కడి గ్రామీణ ప్రాంతాలతో పరిచయం పెట్టుకునే అవకాశం అతనికి లేకపోయింది. లేదంటే నగరానికి దూరంగా ఉన్న విహార కేంద్రాలను, చారిత్రక ప్రదేశాలను దర్శించడం కోసం తల్లిదండ్రులతో కలిసి కారులో వెళ్తున్నప్పుడు అతడు దారి పక్కన కొన్ని వ్యవసాయ క్షేత్రాలను చూడగలిగాడు. చుట్టూరా ముళ్ళకమ్ముల కంచెతో, బలమైన గేటుతో, ఆవరణ నడుమ భూస్వామి కట్టుకున్న అందమైన గృహంతో తీర్చి దిద్దినట్టు కొన్ని వందల ఎకరాల మేరకు విస్తరించిన ఆ వ్యవసాయ క్షేత్రాలు, ఆ దేశంలో మానవుడు సాధించిన ప్రగతికీ, సమకూర్చుకున్న సదుపాయాలకూ కొండ గుర్తులుగా కానవచ్చాయి. అమెరికాతో పోల్చి చూస్తే ఇండియా చాలా బీద దేశమని రవిబాబు విన్నాడు, చదివాడు. కానీ విజయవాడలో రైలు దిగి, అక్కడినుంచి యాభై మైళ్ళదూరంలో ఉన్న అమ్మమ్మగారి ఊరికి కారులో వెళ్తున్నప్పుడు కనిపించిన దృశ్యాలను బట్టి అతను తన అభిప్రాయాన్ని కొంచెం సవరించుకోవలసి వచ్చింది. విశాలమైన పొలాలు, కనుచూపు ఆనినంత మేరకు వ్యాపించిన పచ్చటి పైర్లు, కావలసినంత జలసంపద, కళకళలాడే గ్రామాలు, తృప్తిగా కనిపించే మనుషులు, 'ఫరవాలేదే. భారతదేశం కూడా బాగానే ఉందే!' అనుకున్నాడు. అయితే రాయలసీమలో అడుగుపెట్టిన తరవాత అతనికి భారత దేశపు నగ్న స్వరూపం క్రమక్రమంగా అవగతం కాసాగింది. దారి పక్కన కానవస్తున్న పల్లెల్లో ఒకటి రెండు మిద్దెలో, పెంకుటిండ్లో కనిపిస్తున్నా, మిగిలిన వన్నీ మట్టిగోడలతో , పూరికప్పులతో, మురికి పరిసరాలతో మనుషులెప్పుడో వలస పోయినందువల్ల బోసిపోయిన నివాసాల్లా గోచరమవుతున్నాయి. ఎడారిలో దారితప్పిన ప్రయాణికుల్లా ఇక్కడి ప్రజలు నిస్సహాయులుగా కనిపిస్తున్నారు. పెద్దవాళ్ళ ముఖాల్లో తెంపులేదు. పిల్లల శరీరాలకు సరైన ఆచ్ఛాదన లేదు. అన్నింటికన్నా ముఖ్యమైన విషయం ఈ ప్రాంతం మీద వరుణదేవుడెందుకో గట్టిగా కక్షగట్టినట్టున్నాడు. పిట్టగోడలు లేని నేల బావుల్లో నుంచీ వంగి వంగి నీళ్ళు చేదుతున్న స్త్రీలను చూచినప్పుడు అతని గుండె అవిసిపోయింది. కొళాయి

నుంచి నీళ్ళు రావడం మాత్రమే చూసిన రవిబాబు, ఈ భూప్రపంచం పైన నీళ్ళ కడవలు నెత్తిమీద పెట్టుకుని ఏడుమట్ల బావుల్లోంచి మెట్లెక్కి పైకి వచ్చే స్త్రీలు కూడా ఉంటారని అప్పుడే గ్రహించాడు. మేతకోసం మందలు మందలుగా అడవులవైపు వెళ్తున్న గొడ్లను చూచి ఇక్కడి ఆహార సమృద్ధి ఏపాటిదో తెలుసుకోగలిగాడు. కట్టెల మోపులు తలమీద పెట్టుకుని, దిగంతాలలో నుంచీ దూరి వస్తున్నట్టున్న ఆకారాలనుబట్టి కొందరి పాలిటికి జీవితం ముళ్ళపానుపుకన్నా సుఖవంతంగా లేదని గ్రహించాడు. పెద్దవీ, చిన్నవీ అయిన గుట్టల నడుమ ఏటవాలుగా పడివున్న ఎర్రటి బీటినేలలు తిండికి నోచుకోని భూదేవి ఎండిన డొక్కల్లా అతనికి కనిపించాయి.

కొన్ని ప్రాంతాల నైసర్గిక స్థితిగతులు కొత్తవాళ్ళను భయపెట్టగలవన్న చేదైన అనుభవం నుంచీ రవిబాబు ఇంకా తేరుకోనేలేదు. "మహల్, మహల్! ఎవరండీ మహల్లో దిగేది?" అన్న కండక్టరు కేకతో ఉలికిపడి అతను దిగ్గునలేచి నిల్చున్నాడు.

బస్సు రవిబాబును దింపిన చోట 'మహల్' అన్న పేరుతో వ్యవహరించబడే ఊరుగానీ, కట్టడంగానీ కానరాలేదు. ఒంటరిగా బిక్కు బిక్కు మంటున్న ఓ రైస్‌మిల్లు మాత్రం కనిపించింది. దేశం సుభిక్షంగా ఉన్న కాలంలోనైతే పని చేస్తుందేమో, ఇప్పుడదికూడా మూతబడింది. దాని పార్శ్వంలో చెక్కలతో నిర్మించిన చిన్న కొట్టు ఒకటి. నాలుగైదు సీసాల్లో నాసిరకం మిఠాయిలు, వెదురు తట్టలో తమలపాకులు, వక్కలు, వాడి వడిలిపోయిన కొన్ని అరటి పళ్ళు, ఇంకా అలాంటివే మరికొన్ని ఉంచుకొని ఒక సాహేబు ఈగలు తోలుకుంటున్నాడు.

'తూరుపు దిక్కుగా వెళ్ళే మట్టిబాట...' ముసలాయన మాట రవిబాబుకు జ్ఞప్తికి వచ్చింది. ఆ బాట కాస్తా కనిపించకపోయి వుంటే అతనికి మతిపోయి ఉండేది.

ఎందుకైనా మంచిదని బంకు దగ్గరికి వెళ్ళి "ఏమండి! రాగులపాడుకిటేనా వెళ్ళవలసింది?" అని అడిగాడు రవిబాబు.

"అవున్లే ! రాగులపాడ్లో ఎవరింటి కెళ్ళాల?" అన్నాడు సాయిబు.

చిరకాలంగా తన మనసులో నలుగుతున్న పేరును తొలిసారిగా బయటపెట్టాడు రవిబాబు.

"సుబ్బారాయుడా? ఎవరబ్బా! అటుమంటి పేరుండే మనిషి ఆ ఊళ్ళో ఎవరూ లేరే! ఈడ పుట్టి పెరిగినోణ్ణి! నాకు తెల్వకుండా ఉంటాడా?" సాయిబు సంశయం వెలిబుచ్చాడు.

తానిలా బయల్దేరి రావడం పెద్ద పొరబాటేమోననిపించింది రవిబాబుకు. నోట తడి ఆరిపోయింది. కళ్ళల్లోకి కన్నీరొచ్చేసింది గూడా!

"ఉండుండబ్బయ్యా! సమయానికి తపాలాయన కనిపిస్తా ఉండాడు. ఆయన్నడిగితే ఏ సంగతీ తెలిసిపోతాది. మళ్ళీ ఇందులో నాకూ, నీకూ మాటెందుకు?" ఒక్కింత ఓదార్పుగా అన్నాడు సాయిబు.

ఖాకీ దుస్తులు తొడుక్కున్న పోస్టుమన్ రివ్వున సైకిలుమీద వచ్చి దిగి, "మార్చినెల మొదులుగాక ముందే ఎండలు మండిపోతా ఉండాయి. ఒక సోడా కొట్టియ్యవయ్యా జమాల్ సాబ్!" అన్నాడు.

"ఇస్తాన్లే గానీ తపాలాయనా, ఈ అబ్బోడెవురో రాగులపాడు కెళ్ళాలంట! ఆడెవురో సుబ్బరాయడని ఉండాడంట! అటువంటి నపురొక డుండాడని నాకు తెలియకపోయె! అడ్రస్సులు తెలిసినోడివి గదా! నిన్నడిగితే తేలిపోతాదని చెప్పినాను" అంటూ తన బాధ్యతను పోస్ట్‌మన్‌కు బదలాయించాడు జమాల్ సాయిబు.

"సుబ్బారాయుడా? ఏం మాట! ఆ పేరు మన పాయకట్టులోనే లేదే! అసలింతకున్నూ, ఇంటిపేరు?"

"మొగిలి" అన్నాడు రవిబాబు, నెమరుకు తెచ్చుకుంటూ.

"మొగిలి సుబ్బారాయడా? ఆ మాట జెప్పు! ఇప్పుడు తెల్సిందిలేవయ్యా జమాల్ సాబ్! కారుడ్లు, కవర్లు కూడా మా పోస్టాఫీసు కిట్లా దారి తప్పి రావడం మామూలే! ఎందుకంటావా? రాగులపాడనే పేరుతో దానిల్లు బంగారంగానూ, ఇంకొక ఊరుండి పోయింది. ఆడి జాబులు ఈడికి, ఈడి జాబులు ఆడికీ డింకీ కొడతా ఉంటాయి. అట్లా వచ్చిన వాట్ని తిప్పి పంపేవాణ్ణి నేనేగదా! అందువల్ల నాకు దెల్సు. మొగిలోళ్ళుండడం ఆ రాగులపాడులోనే! సర్లే, అయిన పెండ్లికి మేళాలెందుగ్గానీ, చూడబ్బయ్యా నువ్వొక పన్జెయ్! ఇంకొక అరగంటలో కడప నుంచి చిత్తూరు వెళ్ళే బస్సొస్తుంది. దాన్నెక్కెయ్. పీలేరు, కల్లూరు, పాటూరు దాటినాక పూతలపట్టు క్రాసు అన్జెప్పు. తిరుపతి రోడ్డొచ్చి కడపరోడ్డుతో కలిసే దక్కణ్ణే. ఆ రోడ్డులో అరమైలు దూరం నడుపు, అంతే రాగులపాడు వచ్చేసుంటుంది..."

"ఇంక నువు జెప్పొద్దులే తపాలాయనా!" అందుకున్నాడు జమాల్ సాయిబు. "బిడ్డను బద్దరంగా చిత్తూరు బస్సెక్కించే జవాబ్దారీ నాది! పాపం, ఏ తల్లి గన్న బిడ్డో! తెల్వకపోయి ఇంత దూరమొచ్చేసినాడు. పొద్దున్న ఏం తిననాడో ఏమో! మొకం పెరికి పారేసిన పొద్దిరుగుడు పువ్వు మాదిరిగా వాడిపోయింది. ఏమబ్బయ్యా! నీక్కూడా ఒక సోడా కొట్టియ్యమంటావా?"

ఎంతగా ఇంపితం గాకపోయినా రెండు గుక్కల సోడానీళ్ళు గొంతుకలో పోసుకున్నాడు రవిబాబు. డబ్బు చెల్లించేశాక బంకు ముందర సేదదీరే అధికారం సంక్రమించినట్టె కాళ్ళు కదలుతున్న కుంకిలి బెంచీపైన కూర్చున్నాడు.

నాలుగైదు లారీ లొచ్చాయి. దుమ్ము రేపుకుంటూ వెళ్ళిపోయాయి. ఒక బస్సయితే వచ్చింది గానీ 'ఉండుండబ్బయ్యా అది చిత్తూరు బస్సుకాదు' అన్నాడు జమాల్‌సాయిబు. రెండు వ్యాన్లు వచ్చాయి. వాటి టాప్పుమీద కూడా మనుషులే. ఆఖరుకు అరగంటలో వస్తుందని పోస్ట్‌మన్ చెప్పిన చిత్తూరు బస్సు అలాంటి అరగంటలు నాలుగు గడిచిన తరవాతగానీ రాలేదు. ఎప్పుడొస్తే నేమి, అది రావడమే పదివేలనిపించింది.

అయితే, ఆ బస్సురావడానికి కొంచెం ముందుగా కాస్త తికమక ఏర్పడింది. చెవులు రిక్కించుకుని వింటున్న జమాల్ సాయిబు సవ్వడి పసిగట్టి "వొచ్చేస్తా ఉంది. అదే చిత్తూరు బస్సు" అన్నాడు. రవిబాబు రోడ్డువైపు పరిగెత్తి ఉత్తరంగా చూశాడు. నిజమే బస్సు వస్తూంది.

ఆ క్షణాన నిద్రలో ఉన్న వ్యక్తిని ఎవరో తట్టిలేపినట్టుగా రవిబాబుకొక విషయం గుర్తుకొచ్చింది. "ఏమండీ సాయిబుగారూ! పోస్టమన్‌గా రేదో క్రాసుపేరు చెప్పారు. అదేమిటో మరిచిపోయాను" అన్నాడు కంగారుగా.

జమాల్ సాయిబు ముఖంలో పరితాపం తాండవించింది. "బలేవోడివేలే అబ్బయ్యా! ఇట్లాగయితే నువ్వూరుజేరినట్టే. నాకు గ్యాపకముందిలే. పూతలపట్టు క్రాసు. చెప్పు, ఏం క్రాసు?"

'పూతలపట్టు క్రాసు, పూతలపట్టు క్రాసు...' ఎక్కినప్పుడే కాదు, ఆ బస్సు ప్రయాణం పొడుగునా రవిబాబు ఆ పేరును పదే పదే మననం చేసుకుంటూ ఉండిపోయాడు.

మనుషులెలా జీవిస్తున్నారో తెలియని మరు భూములగుండా బస్సు పరుగెడుతూంది. దారిలో అక్కడక్కడా ప్రయాణికులు బస్సు కడ్డంగా చెయ్యి చాపుతున్నారు. ఆగి వాళ్ళనెక్కించుకుని బస్సు మళ్ళీ సాగిపోతూంది. రవిబాబు కొక సందేహం కలిగింది. చూసినంతవరకు ఈ రాతిపర్రల, బీడుభూముల ప్రాంతంలో ఒక పల్లెగానీ, ఇల్లుగానీ కానరావడం లేదు. మరైతే ఈ మనుష లెక్కడినుంచి వస్తున్నారు? కొండల్లోని బిలాలలో నుంచీ వస్తున్నారా? నేలలోని సొరంగాలలోనుంచీ వస్తున్నారా? ఏమిటో ఏదీ ఊహ కందడం లేదు.

సాయంత్రం ఆరు గంటలప్పుడు బస్సు పూతలపట్టు క్రాసులో ఆగింది.

రేయింబవళ్ళూ లారీలు ఆగే చోటు గనుక అక్కడ బీడీబంకులు, నాష్టా హోటళ్ళు చిల్లరం గళ్ళు అన్నీ కలిసి పదిపన్నెండుదాకా ఉన్నాయి. బస్సు దిగేటప్పటికి పాదాలు గాలిలో తేలిపోతున్నట్టు, చుట్టూరా నెలకొన్న ప్రకృతి మనకబారినట్టు తోచేసరికి రవిబాబుకు తానెంతగా డస్సిపోయాడో తెలిసొచ్చింది. నడవడానికైనా త్రాణ ఉండాలి గదా? ఒక టీ కొట్టులోకి వెళ్ళి నాలుగు బిస్కట్లు ఒక బన్ రొట్టెతో కలిపి ఇన్ని కాఫీనీళ్ళు కూడా పుచ్చుకున్నాడు. శారీరకంగా కొంచెం ఉత్తేజం చేకూరినట్టయింది. రోడ్డుపైకి వచ్చాడు. బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణీకుల సంభాషణలో రాగులపాడు ప్రసక్తి వినిపించింది. 'ఫరవాలేదు. దారిలోనే ఉన్నాను' అనుకున్నాడు. నిర్భయంగా "ఏమండీ! రాగులపాడు కిటేనా వెళ్ళడం?" అని వాకబు చేశాడు.

"ఇదే దారి. ఆ మిట్ట దాటితే ఒక మర్రిచెట్టు కనిపిస్తుంది. అక్కడ్నించీ దక్షిణంగా చూడు. అదే రాగులపాడు" అన్నాడొక మార్గదర్శి. అంతటితో ఊరుకోక "ఆ ఊళ్ళో ఎవరింటికెళ్ళాల?" అని అడిగాడు.

గొంతుకలో కొట్టుమిట్టాడిపోతున్న ఆ పేరును మళ్ళా ఒకసారి బయటపెట్టాడు రవిబాబు.

"ఆ పెద్దాయన ఇంటికా? అయనేం కావాలమ్మా నీకు?" ఆ కంఠంలో ఆశ్చర్యం ధ్వనించింది.

రవిబాబు చరచరా ముందుకు నడిచాడు. మరేం చేస్తాడు? ఆ మార్గదర్శి అడిగిన ప్రశ్నకు తాను నిరుత్తరుడు. 'అయ్యా! ఆ పెద్దాయన నన్నింతవరకూ చూడలేదు. ఆయన ఎలా ఉ ంటాడో నాకు తెలియదు. కానీ, ఆయన లేకపోతే నా తండ్రి లేడు. నేను లేను, అదీ మా బాంధవ్యం!' అని చెప్పుకోడానికి నోరెలా వస్తుంది?

రోడ్డులో మిట్ట ఎదురైంది. ఆ మిట్ట నెక్కుతుండగా మర్రి చెట్టు తాలూకు కొనకొమ్మలు కనిపించాయి. ఆఖరు కెలాగైతేనేమి, గమ్యం చేరువకు వచ్చేసింది. అయితే, ఆనందానికి బదులుగా రవిబాబు మనసులో ఏదో ఉద్విగ్నత సందడిచేస్తూంది. తాను నివసిస్తున్న సమాజం వేరు. ప్రకృతి మీదా, పరిస్థితుల మీదా ఆధునిక నాగరికత సాధించిన విజయాల కది కొలువుకూటం. స్వదేశానికి వచ్చిన రెండు మూడు పర్యాయాల్లో అమ్మమ్మగారి ఊళ్ళో, వాళ్ళ ఇంట్లో ఎదురైన సమాజం వేరు. సంపన్న దేశాలలోని నవనాగరిక సమాజం లాంటిది కాకపోయినా, అది దానికి రెండోదో, మూడోదో అయిన కార్బన్ కాపీ అని చెప్పొచ్చు. ఇక కొద్ది సేపట్లో తానడుగు పెట్టబోతున్న సమాజం వేరు. ఇదెలా ఉంటుందో?

మిట్ట దిగాడు రవిబాబు. మర్రి చెట్టును సమీపించాడు. కొద్ది నిమిషాల పాటు చెట్టుకింద నిలబడిపోయి తానెరుగని తన ఊరి వైపు చూచుకున్నాడు.

గుంపుగా కొన్ని ఇళ్ళు. దాదాపు యాభై దాకా ఉండొచ్చు. ఎక్కువగా పూరికొట్టాలే. వాటిమధ్య అక్కడొకటి, ఇక్కడొకటిగా పెంకుటిళ్ళున్నాయి. ఇన్నింటిలోనూ కొత్తగా కట్టింది గానీ, పాతబడి పోకుండా ఉన్నది గానీ ఒక్కటైనా కనిపించడం లేదు. ఏ విధంగా చూసినా ఆ ఊరిని గురించి ప్రత్యేకంగా చెప్పుకోదగ్గ అంశమేదీ రవిబాబుకు స్ఫురించడం లేదు. ఊళ్ళో జనమున్నారు. అందుకు నిదర్శనం ఊరి చుట్టూ చేలలో ఆడుకుంటున్న పిల్లలు. వంటలు వండుకుంటున్నారు. అందుకు తార్కాణం చూరుల్లోంచి పైకి లేచిపోతున్న పొగ. నీళ్ళు తాగుతున్నారు. అందుకు దాఖలా ఊరి ముందర చేదబావినుంచీ వినవస్తున్నగిలకల చప్పుడు. చీకటి పడితే ఇళ్ళలో దీపాలు వెలిగించుకుంటారు. ఇందుకు గుర్తు ఊళ్ళోకి వెళ్తున్న కరెంటు తీగలు. ఈ ఊరి గాలిలో విద్యాగంధం కూడా కొంత కలిసినట్టే ఉంది. అందుకు సాక్ష్యం చిన్న పాఠశాల కట్టడం. ఎంతటి వెనుకబడిన దేశంలోనైనా మెల్లమెల్లగా మార్పొస్తుందని విదేశాల్లో ప్రచారం చెయ్యడం కోసం 'భారతదేశంలో ఒక పల్లెటూరు' అన్న శీర్షికకింద ఆ ఊరి నట్లాగే ఫోటో తీసుకోవచ్చు.

పగటి వెలుగులు క్రమక్రమంగా తరిగిపోయి, రేజీకట్లు మెల్లమెల్లగా ముసురుకుంటున్న ఆ మునిమాపు వేళ, అపరిచితుడైన పడుచువాడొకడు కాలిబాట వెంట ఊరి వైపు నడిచి రావడం గమనించి ఆడుకుంటున్న పిల్లలందరూ ఊరి ముందర గుమిగూడిపోయారు. బావి దగ్గర నీళ్ళు చేదుకుంటున్న ఆడవాళ్ళు విగ్రహాల్లా స్తంభించిపోయి విస్మయంతో చూస్తున్నారు. రచ్చబండమీద కూచున్న మగవాళ్ళ దృష్టికూడా కాలిబాట వైపు కేంద్రీకృతమైపోయింది.

"ఏ ఊర్నాయినా? ఎవురి కోసర మొచ్చినావు?" ఓ నడివయసు ముత్తయిదువ ప్రశ్నించింది.

"సుబ్బారాయడుగారండీ! మొగిలి సుబ్బారాయడు గారు. ఇల్లు ఎక్కడో చూపిస్తారా?"

"సుబ్బరాయడా! ఆయన కోసర మొచ్చినావా? ఆయన్తో నీకేం పనో?" చెట్టు కానుకుని బీడీ కాల్చుకుంటున్న ఓ కోరమీసాల ఆసామీ ఆశ్చర్యం ప్రకటించాడు.

అట్టే కొనసాగనివ్వకుండా ఈ 'సస్పెన్సు'ను తొందరగా తుంచేయాలనిపించింది రవిబాబుకు. అందుకని వీలైనంత క్లుప్తంగా, సూటిగా "మా నాన్నగారి పేరు నరసింహంగారు. మేముండడం అమెరికాలో" అన్నాడు.

"ఒరేయ్! ఒరేయ్! మన నర్సిమ్ములు కొడుకంట్రా! పోలిక తెలియడంలా? అచ్చంగా ఆ తాతకు మనవడే! పరుగెత్తు. పరుగెత్తు. మంగమ్మతో మనవడొచ్చినాడని జెప్పు..." 'ఇప్పుడే అందిన వార్త' అంటూ రేడియోలో ప్రకటించినట్టుగా ఆరు పదులు దాటిన వృద్ధుడొకాయన తనకు గ్రాహ్యమైన విషయాన్ని ఊరిపైకి ఊదేశాడు. అంతలోనే కొంచెం జాగరూకుడైపోయి బిగ్గరగా "ఒరేయ్, చిన్నోడా! ఆనందంలో ముసల్దాని కెక్కడైనా గుండె ఆగిపోయేను. కొంచెం నిదానంగా జెప్పరా" అన్నాడు.

"అమెరికా నుంచొస్తున్నావా?... అయ్యో, ఎంత దూరమో! ఇమానంలోనా రావడం? అమ్మో, కండ్లు తిరగలా? మీ అయ్య బాగుండాడా?... ఏం, మా ఊరికి రాడంట్నా? అవును. ఇప్పుడే బస్సులో దిగినావు?" ఊఁ ఆఁ అని బదులు చెప్పడానికి సైతం వీల్లేకుండా ప్రశ్నల వర్షం కురిసిపోతూ ఉంది.

మబ్బు తెరల్ని చీల్చుకుని వెన్నెల తొంగి చూచినట్టుగా, అప్పుడొక ముసలావిడ జన సమూహాన్ని చీల్చుకుంటూ ఈవలికి వచ్చి రవిబాబు ఎదుట నిలబడింది. ఆవిడ బక్కపలచటి మనిషి. వయోభారం వల్ల నడుము వంగిపోయింది. తలలో తెల్లపు వెంట్రుకల పాలే హెచ్చు. నల్లంచు ఎరుపు చీర కట్టింది. నుదుట పెట్టుకున్న బొట్టుకు మించి ఆమెలో మరేం సిరులూ లేవు.

"ఏం దట్లా జూస్తావు మంగమ్మవ్వా! నీ మనవడేలే! సీమనుంచొచ్చి నాడంట! అవ్వను, తాతను జూడాలని ఇమానమెక్కి, రైలెక్కి, బస్సెక్కి ఇంత దూర మొచ్చినాడు. తీసుకపో! ఇంటికి తీసుకపోయి వాళ్ళ తాతకు జూపించు."

అనిమిషత్వం సిద్ధించడంవల్ల ఆ క్షణాల్లో మంగమ్మవ్వ దేవతైపోయింది. కానీ, చూపు సారించడానికి వీల్లేకుండా కంఠం గాద్గదికమై పోయింది. పెదవులు ఎండుటాకుల్లా చలించాయి. అవున్నిజమే. తనకు నర్సిమ్ములన్న కొడుకున్నాడు. అయితే, ఒక వస్తువు గానీ మనిషి గానీ ఏండ్లుగా, పూండ్లుగా కనిపించకపోతే ఉండడానికి లేకపోవడానికి అట్టే తేడా ఉండదు. అయితే, నర్సిమ్ములున్నా డనుకోవడానికి ఇప్పుడొక రుజువు దొరికింది. వీడు వాడి బిడ్డ. బిడ్డలెక్కడో ఒకక్కడ క్షేమంగా ఉంటే చాలు. అంతకంటే కావలిసిందేముంది?

మంగమ్మ మనవడి చేయి పట్టుకుని మెల్లగా ఇంటికి తీసుకెళ్ళింది.

సుబ్బరాయుడి మనవడు సముద్రాలు దాటి, దేశాలు దాటి, రాష్ట్రాలు దాటి రాగులపాడుకు వచ్చేశాడన్న విషయం ఆ పాటికి ఊరంతా తెలిసిపోయింది. కానీ, విడ్డూరమేమిటంటే- ఆ

వార్త ఎవరికైతే ముఖ్యంగా తెలియాలో ఆ సుబ్బరాయుడికి మాత్రం అందింది గాదు. ఆ ముసలాయన నిమ్మళంగా నులక మంచంలో కూర్చుని ఆవుకు పగ్గం పేనుకుంటున్నాడు.

మంగమ్మ మనవణ్ణి అతని ఎదుట నిల్చోబెట్టింది. కానీ, అతిథి రాకను గురించి భర్తకు ఎరుకపరిచే ఓపిక మాత్రం ఆమెకు లేకపోయింది. సుబ్బరాయుడికి బ్రహ్మచెముడు!

వెంట వచ్చిన వాళ్ళెవరో చెవి దగ్గర నోరు పెట్టి అరిచి గీపెట్టినట్టుగా వృత్తాంతాన్ని నివేదించారు.

సుబ్బరాయుడి కళ్ళు పెద్దవయ్యాయి. ఫాలతలంలో గీతలు పడ్డాయి. ముఖంలో ఆశ్చర్యం చిందులు తొక్కింది. ఎండుపుల్లల్లాంటి చేతులు పైకిలేచి, రవిబాబును మంచంపైన కూచోబెట్టుకున్నాయి. ముఖమంతా కళ్ళు చేసుకుని చూస్తూ ఉండిపోయాడు.

చూచినంత సేపు చూచి, మెల్లగా ఉపక్రమించాడు.

"ఏమే మంగా! మనవడొచ్చినాడు చూచినావా? మూడు మోసాయలా దొరబిడ్డే! ఈ బాబు నీకూ నాకూ మనవడంటే ఎవరు నమ్ముతారు? వచ్చి ఎదురుగా నిలబడి పోయినాడు కాబట్టి నమ్మేసినాం. ముసలోళ్ళని చూచి పోదామని ఎంతో దూరం నుంచి వచ్చినాడు! ఏంచేసి పెడ్తావోమరి? ముందుగా పాలు కాచివ్వు. అందులో బెల్లమేసేవు. ఇంట్లో చెక్కరుందోలేదోచూడు. ఏంనాయనా! ఏముందని వొచ్చినావు బాబూ ఈ ఊర్లో? నువు కూచోడానికి కుర్చీ పీటయినా లేదే! పండుకోవాలంటే చినిగిపోని చాపయినా లేదే!... అట్లా ఎదబడి నిలిచిపోయావేమే మంగా! ఎళ్ళెళ్ళు - పాలిచ్చినాక పొయిమీద ఎసురుపెట్టు. మనం తినే నాటుబియ్యమెక్కడైనా అందులో పడేసేవు! అయ్యవారింటికి పోయి అడుగు, నెల్లూరు బియ్యముంటుంది. పడో, శేరో అరు విప్పించుకో! ఏం నాయనా? అమెరికానుంచీ మీ అయ్యా, అమ్మా, అందరూ కలిసొచ్చినారా?... నువ్వొకడివే వొచ్చినావా?... మీ అయ్యకు తెలుసునా నువ్వీ ఊరొచ్చేది?... ఎట్టా లేదన్నా రెండు మూడేండ్ల కొకసారి ఒస్తున్నా రంటగదా! ఇజయవాడదాకా వచ్చినాక, ఈ కాసంత దూరం రావడం కష్టమా?"

ముసలాయన మాట్లాడుతూ ఉండగానే మంగమ్మ వంట పనులన్నీ ముగించింది. నెల్లూరు బియ్యం బదులిప్పించుకొచ్చి అన్న వండింది. వంకాయలు వేసి పప్పు పులుసు చేసింది. పక్కింటి వాళ్ళెవరో రెండు కోడిగుడ్లు తెచ్చిస్తే అట్లు పోసింది. ఇంట్లో పాలిచ్చే ఆవుంది గనుక పెరుగుకోసం వెతుక్కోవలసిన అవసరం లేకపోయింది.

వంట పూర్తయ్యేటప్పటికి పొంత కడవలో నీళ్ళు సలసలా కాగాయి. స్నానం చేసి భోజనం చేసేటప్పటికి రవిబాబుకు నిద్ర ముంచుకొచ్చేసింది.

అయినా, ఎంతో ప్రయత్నంమీద అతను కాసేపు కళ్ళు తెరుచుకునే పడుకున్నాడు. అలా మేలుకున్న కొద్ది నిమిషాల వ్యవధిలో అతను పోర్టికోలు, బాల్కనీలు, వేచి ఉండడానికీ, పడుకోవడానికీ, వంటకూ, స్నానానికీ ప్రత్యేకంగా గదులు, రిఫ్రిజిరేటర్లు, టి.వి.లు, సుఖాసనాలు,

మేజాలు, బల్లలు, పట్టెమంచాలు, డన్‌లప్ పరుపులు మొదలైన సదుపాయాలకు దూరంగా మానవులు ఎలా బ్రతుకుతున్నారో గ్రహించడానికి వీలయింది.

అతడు పడుకున్నది రెండు దూలాలు వేసి కట్టిన మూడంకణాల పెంకుటిల్లు. అందులో దక్షిణపుతట్టు గోడకడ్డంగా దొంతులు దొంతులుగాబానలు. కడవలు, తలుపువెనుక ఒక మట్టిగాదె. దొంతులకూ, గాదెకూ మధ్య ఒక పాత కొయ్యపెట్టె. దానిపైన బొంతలు, దిండ్లు .దండెం పైన మాసిన బట్టలు. ద్వార బంధానికి అటు వైపున కొయ్యి పక్కగా చిన్న అడ్డుగోడ. ఉత్తరపు వైపు గోడ పొడుగునా జానెడెత్తున కట్టిన దిన్నెపైన నీళ్ళ కడవతోబాటు కుండలు, సత్తుబోకులు, ఇత్తడి గ్లాసులు. నట్టింటి దీగుట్లో ఒక చిన్న వేంకటేశ్వరుడి పటం. అంతకు మించి మరేమీ లేవు.

ఉదయం నిద్ర లేచేటప్పటికి ఇంటి ముంగిట ఒక కొత్త గొంతుక వినిపించింది.

"ఏమమ్మో, మంగమ్మత్తా! మనవ డొచ్చినాడట గదా! నేను చిత్తూరికి పోయివుండి, రాత్రెప్పుడో పదిగంటలకొచ్చినా. ఇంట్లో నాగరత్నం చెప్పింది."

"ఒచ్చినాడు సరేగానీ రాజయ్యా, అబ్బోడితో ఎట్లా మాటాడాల్నో మనకు తెలియకపోయ, వాడికేమో మన మాట సరిగ్గా రాకపోయ. ఇవరాలన్నీ అడిగి తెలుసుకోవాల."అంటూ ఉంది మంగమ్మ.

ఈలోగా రవిబాబు లేచి ఈవలికి వచ్చాడు.

"అబ్బాయి ఒడ్డూ పొడుగూ బాగున్నాడే! ఉన్నట్టుండి చూస్తే సీమదొరల బిడ్డనుకోవాల్సిందే! పోనీలే, కుర్రవాణ్ణి చూస్తుంటే వాళ్ళ నాయన్నూ చూచినట్టే ఉంది. నీ పేరేమిటి బాబూ?" రాజయ్య ప్రశ్నించాడు.

రవిబాబు చెప్పుకున్నాడు.

"చూణ్ణాయనా ! ఈయన రాజయ్య. మీ అయ్యతో కలిసి పూతలపట్టు అయిస్కూల్లో చదువుకున్నోడు. మనూరి బడిలోనే టీచరుగా ఉండాడు..." ఆగంతుకుణ్ణి పరిచయం చేశాడు సుబ్బరాయుడు.

"నమస్కారమండీ!" రవిబాబు చేతులు జోడించాడు.

"నాయనా రవిబాబూ! నువు కాలకృత్యాల సంగతి జూడు. ఆ తర్వాత మనం మా ఇంటికి వెళ్దాం. ఈ పూట నీ కక్కడే టిఫిను..." అన్నాడు రాజయ్య

ఉపాహారం తీసుకున్నాక రాజయ్య మేస్టారు రవిబాబును ఊరి నాలుగు వైపులా తిప్పి ఎన్నో విశేషాలు ఏకరువు పెట్టాడు.

"ఆ మామిడితోపు కవతల కనిపిస్తోంది చూచావా రవీ, అది జముకుల గుట్ట. మీన్నాన్నా, నేనూ దానిపైన ఎన్నిసార్లెక్కినామో లెక్కలేదు. ఆ ముక్కుగుండుకు దగ్గరగా ఒక బండ ఉంది. దానిమీద పడుకుని ఆకాశంలోకి చూస్తూ నరసింహం బిగ్గరగా పాడేవాడు. పోతనగారి పద్యాల

దగ్గరినుంచి మొదలుపెట్టి, రాయప్రోలు గేయాలు సాగదీసి, ఆఖరుకు చుక్కలూరు రామ నాటకం దరువులు లంకించుకునేవాడు. వాడి గొంతుకూడా చాలా కమ్మగా ఉండేది. నాయనా, రవిబాబూ! మీ నాన్న ఎప్పుడైనా పాడుకోగా నువ్వు విన్నావా?"

"లేదండీ! డాడీకి మమ్మీకి వెస్టర్న్ క్లాసికల్ సంగీతమంటే ఇష్టం. ఆ కేసెట్స్ మా ఇంట్లో దండిగా ఉన్నాయి."

"అదిగూడా గొప్ప సంగీతమే అయి వుంటుంది, ఉండనీలే! ఆ తోపుకొక మూలగా ఒక పెద్దచెట్టుంది చూచావా, రవీ! దాన్ని నేరేడు చెట్టంటారు. దాని పండ్లు భలే రుచిగా ఉంటాయిలే! ఒకసారేమైందో తెలుసా? నేనూ, నరసింహం చెట్లెక్కి పండ్లు కోసుకుంటున్నాం. వాడి కాలు జారింది. పట్టుదప్పింది. పడిపోతున్నాడు. కిందకొమ్మ ఒకటి చేతికి దొరకబట్టి బ్రతికిపోయాడు. వెంట్రుకవాసిలో ప్రాణపాయం తప్పింది. మీనాన్న ఎప్పుడైనా ఈ సంఘటనను గుర్తుకు తెచ్చుకుంటాడా రవీ?"

"ఊహూ!... నాకు తెలిసినంతవరకూ లేదండీ!"

సీతను కోల్పోయిన శ్రీరాముడు స్వర్ణసీతతో పబ్బం గడుపుకున్నట్టుగా, రాజయ్య మేష్టారు తన బాల్య స్మృతులు నెమరువేసుకోడానికి నరసింహానికి బదులుగా అతని కుమారుడు దొరికిపోయాడు. తామిద్దరూ కలిసి ఏటి దగ్గర ఏతాము తొక్కిన కథ, ఎద్దులబండిలో కలవకుంట తిరణాలకు వెళ్ళి వచ్చిన వైనమూ, కలమందతుండ్లపైన చెరువులో విహరించాలనుకుని నీటిలో బుదుంగున మునిగిపోయిన వృత్తాంతమూ ఇంకా ఇలాంటి వెన్నో పూసగుచ్చినట్టుగా వివరించాడు.

ఊరివైపు తిరిగొస్తూ చల్లటి నీడలు పరచుకున్న ఓ రావి చెట్టుకింద ఆ ఇద్దరూ ఒక పావుగంట సేపు కూర్చున్నారు. కూర్చోవడంతోటే రాజయ్య మాష్టారు కుర్రవాడిమీద ఒక ప్రశ్న సంధించాడు. అలవోకగానే అడిగినప్పటికీ అది రవిబాబుపాలిటికి గడ్డుప్రశ్నే పోయింది.

"నాయనా రవీ! నీకొక మేనత్త, ఇద్దరు చిన్నాన్నలు ఉన్నట్టు తెలుసునా?"

రవిబాబు తెల్లబోయాడు. "నాకా! నిజంగా ఉన్నారా? ఎక్కడున్నారండీ?!" ఆశ్చర్యంతో ప్రశ్నించాడు.

"నీ ధోరణినిబట్టి అప్పుడే అనుకున్నానులే, తెలిసుండదని! మేనత్తను ఇక్కడికి దగ్గరలోనే పోలవరంలో ఇచ్చారు. చిన్నాన్నలు మట్టుకు అందుబాటులో లేరు. బ్రతుకు తెరువుకోసం పొరుగు రాష్ట్రాల్లో ఉండిపోయారు. పెద్దతను ఒక ప్రింటింగ్ ప్రెస్‌లో తెలుగు సెక్షను పని చూస్తూ మదరాసులో ఉన్నాడు. ఇంకో అతను కోలారు గోల్డు ఫీల్డులో గుమస్తా ఉద్యోగం చేస్తున్నాడు. ఏం చేస్తారు మరి? పెద్ద చదువులు చదువుకునే అవకాశం వాళ్ళకు లేకపోయింది. మీ నాన్న చదువులకు చేసిన అప్పులనుంచీ ఆ కుటుంబం కోలుకోనేలేదు. ఉండిన నాలుగెకరాల సుక్షేత్రమూ ఆ అప్పులకిందే దఖలైపోయింది..."

రవిబాబు ముఖం వెలవెలా పోయింది. సందేహాల ఉప్పెన అతని మనసును కలచివేసింది. భావావిష్కరణకు తగిన భాషా పరిజ్ఞానం లేకపోవడం వల్ల స్వదేశంలో అడుగుపెట్టినప్పటినుంచీ అతని నోటికి తాళం పడినట్టుండిపోయింది. కానీ ఎదుటి వ్యక్తితాహతును బట్టి, తన ఆవశ్యకతనుబట్టి అతనీసారి తనకు మంచి నీళ్ళప్రాయమైన ఇంగ్లీషులోకి లంఘించక తప్పిందికాదు. అతడా సందర్భంలో చేసిన రెండు నిమిషాల ప్రసంగానికి సారాంశం ఇది: "మా అమ్మమ్మావాళ్ళు బాగా ధనవంతులు గదండి! పెళ్ళివల్ల మా నాన్నగారికేమీ కలిసిరాలేదా?"

రాజయ్య మేష్టారు పకాలున నవ్వేశాడు. అది ఏడవలేక నవ్విన నవ్వని రవిబాబుకు సైతం స్పష్టంగా తెలిసిపోయింది.

"కలిసి రాలేదని ఎలా చెప్పగలం? ఎటొచ్చి రాకెట్టు రోదసీలోకి దూసుకపోవాలంటే, అది భూమ్యాకర్షణ పరిధిలోనుంచీ బయట పడాలి. సరిగ్గా అట్లాగే మొదటి అంచెలో మీ నాన్నకూ, అతని కుటుంబానికీ ఉన్న లంకె తెగ్గొట్టబడింది. వరంగల్లు ఇంజనీరింగు కాలేజీలో చదువుకుంటుండగా నరసింహానికొక స్నేహితుడు దొరికాడు. వాళ్ళ ఇంటికి వెళ్ళివస్తూ ఉండి ఇతను ఆ ఇంటి అమ్మాయిని ప్రేమించాడు. అదేమంత ముఖ్యం గాదు. ఆ అమ్మాయిగూడా ఇతణ్ణి ప్రేమించింది. ఇది చాలా ముఖ్యం. ఆ ఇంటి పెద్ద అప్పటి సిట్టింగ్ ఎమ్. ఎల్. ఎ. కు స్వయానా బావమరిది. కొడుకుల్లో ఒకతను టొబాకో బిజినెస్‌లో బాగా ఆర్జిస్తున్నాడు. రెండో కుమారుడు పెద్ద కాంట్రాక్టరు. చిన్నబ్బాయి గురించి చెప్పానుగదా, మీ నాన్న కతనే క్లాసుమేటు. ఆ కుటుంబం కుటుంబమంతా గొప్ప ఆదర్శవాదులు. వరకట్నం ముట్టజెప్పడం తమ ఆశయాలకు విరుద్ధమని వాళ్ళుకుండ బద్దలు కొట్టినట్టు చెప్పేశారు. కానీ వాళ్ళమ్మాయి పేరిట ఒక లక్షరూపాయలు బ్యాంకులో వేస్తామన్నారు. తమ పెట్టుబడితోనే ఉద్యోగం సంపాదించి పెడతామన్నారు. చాలని దానికి తమ సొంత ఖర్చులతోనే ఘనంగా పెండ్లి జరిపిస్తామన్నారు. ఏ వరుడికైనా ఇంతకన్నా కావలసిందేముంటుంది?శుభ కార్యానికింక పదిహేను రోజులుందనగా రాగులపాడుకు వర్తమానం అందింది. అందుకోసం ఇక్కడినుంచీ వెళ్ళి వచ్చిన పదిపన్నెండు మందిలో నేనూ ఒక్కణ్ణి. ఏమాట కామాటే చెప్పుకోవాలి. పెండ్లి ఘనంగా జరిగిందంటే చాలదు, ఘనాఘనంగా జరిగింది. 'ఎవరు వీళ్ళు? ఎవరి తరపున వచ్చారు? అన్న పట్టింపు లేశమైనా లేకుండా ఎంతో ఉదారంగా దివ్యాన్నాలు వడ్డించారు. వరుడికి మాకూ వున్న సంబంధ బాంధవ్యాలను గురించి నోరు విడిచి చెప్పుకోవాలన్నా మాకు వీల్లేకపోయింది. ఎలా వెళ్ళిన వాళ్ళం అలాగే తిరిగి వచ్చేశాము. ఆ తరువాత కొంతకాలానికి మీనాన్న స్టేట్స్‌కు వెళ్ళినట్టుమాకు తెలిసింది. ఉద్యోగం కూడా దొరికే ఉంటుందని , వీలు చూచుకుని భార్యను కూడా తీసుకెళ్ళి ఉంటాడని ఊహించాము...."

అయిదు నిమిషాలు మౌనంగా గడిచిపోయాయి. 'ఇక వెళ్దామా?' అన్నాడు రాజయ్య. రవిబాబు పైకి లేచాడు.

తిరిగి వచ్చేసరికి ఇంట్లో కొత్త మనుషుల కలకలం వినిపించింది.

"పోలారంనుంచీ మీ అత్త వచ్చింది నాయనా! నువ్వొచ్చినావని రాత్రికి రాత్రే చెప్పి పంపించినాము. నిద్రలేచి వచ్చేసింది..." అంది మంగమ్మ.

ఆ మేనత్తగూడా నాన్నమ్మలా సన్నగా రివటలా ఉంది. ఆమె నవ్వుతూ మాట్లాడుతుంది. నవ్వుతుంటే ఆమె ముఖం వైపు ఇంకా ఇంకా చూడానిపించింది.

"ఏం నాయనా! నువ్వా మా నరసిమ్ములన్న కొడుకువంట, నిజమేనా!" అంటూ ఆమె పలకరించింది.

రవిబాబులో అంతవరకూ వున్న బిడియం పటాపంచలైపోయింది. తాను కూడా నవ్వేస్తూ "నిజమే నండీ!" అన్నాడు.

"మీ అమ్మమ్మా వాళ్ళతో తిరుపతి కొండకని జెప్పి బయల్దేరి ఉంటావు. తిరుపతి టేషన్‌లో దిగి నేరుగా రాగులపాడు దారి పట్టి వుంటావు. ఈ సంగతి మీ అమ్మకు, అయ్యకు తెలిస్తే ఇంకేమైనా ఉందా? నిన్నింట్లోకే రానియ్యరేమో?"

"అబ్బే! అదేం లేదండీ! నేనేం చెడ్డపని చేయలేదు గదా?" అన్నాడు రవిబాబు బింకంగా.

"ఆ తెలివిమంతుడి కడుపులో నువ్వొట్టి ఎర్రిమారాజువి ఎట్లా పుట్టినావో! గాలిపోవిడిగా మాకన్నీ తెలస్తానే ఉండాయిలే నాయనా! మీ అమ్మా, నాయనా రెండేండ్లకో, మూడేండ్లకో ఒకసారి ఇజయవాడదాకా వచ్చి పోతానే ఉండారంట! ఎందుకు రారు? ఆడ మేడలుండాయి. కార్లుండాయి. రాజనాల భోజనాలుండాయి. అందుకన్జెప్పి ఆడికొస్తారు. ఈ రాళ్ళదేశంలో ఏముంది? పూరి కొంపలు, బీటినేలలు, గడ్డీగాదం తప్పా!"

తన తండ్రి తెలివిమంతుడే కావచ్చు. కానీ ఆ తెలివితేటల్లో ఎంతో కొంత శాతం ఆయన తోబుట్టువులోనూ ఉన్నట్టు రవిబాబు గ్రహించాడు. ఈమె తన తిరుపతి ప్రయాణాన్ని గురించిన వర్తమానాన్ని నికరంగా ఊహించగలిగింది. తాను ఒంటరిగా తిరుపతికి రావడానికి అమ్మమ్మా వాళ్ళు సుతారమూ అంగీకరించలేదు. తాను మొండికేసి కూర్చున్నాక తిరుపతిలో తమకుతెలిసిన ఒక మునిసిపల్ కౌన్సిలరుకు ఉత్తరం రాసి ఇచ్చారు. వారి మాట ప్రకారమైతే తిరుపతిలో దిగగానే తను ఆయన్ను కలుసుకోవలసింది. దైవదర్శనంతో పాటు కొండపైకి తీసుకెళ్ళి మళ్ళీ కిందికి తీసుకొచ్చి రైలెక్కించేదాకా ఏర్పాట్లన్నీ ఆయన చేస్తాడు.

మేనత్త రవిబాబుకు తలంటి నీళ్ళుపోసింది. పిండివంటలు చేసి పెట్టింది.

సాయంకాలం అందరూ ఒకచోట కూర్చుని సరదాగా మాట్లాడుకుంటూ ఉండగా "ఏం నాయనా, రవిబాబూ! ఇంతదూర మొచ్చినావు గదా! మా ఊరి కొచ్చి ఒక దినముండి పోరాదా? ఇట్లా పిలిచినానని బెదిరిపోవద్దు. నువు నా కూతుర్నేమీ పెండ్లి చేసుకోవద్దులే!" అంది మేనత్త.

రవిబాబుకు మళ్ళీ నవ్వొచ్చింది. "ఇప్పుడుగాదండీ! ఇక్కడే ఓ మెడికల్ కాలేజీలో చేరాలని ఉన్నాను. నేను దేశం వచ్చిందందుకే! సెలవు లొచ్చినప్పుడల్లా ఇక్కడికొస్తాను. ఈసారి వచ్చినప్పుడు తప్పకుండా మీ ఊరి కొస్తాను" అన్నాడు.

"మా నాయనే! నువ్వొస్తావని నాకు తెలుసులే! నాకా నమ్మకముంది..." అంది మేనత్త.

రవిబాబు తన దగ్గరున్న బాల్‌పాయింటు పెన్నులు రెండింటిని మేనత్తతో బాటుగావచ్చిన ఆమె మగపిల్లలిద్దరికీ బహూకరించాడు. వాళ్ళ ఆనందానికి హద్దులు లేవు. "బావ మాకు పేనాలిచ్చినాడే, అమ్మా!" అంటూ మురిసిపోయారు.

మరునాటి ఉదయం రవిబాబును సాగనంపడానికి ఇంటికొకరిద్దరు చొప్పున రాగులపాడు గ్రామస్థులు పూతలపట్టు క్రాసుదాకా వచ్చారు. బస్సెక్కబోతుండగా మేనత్త రవిబాబును హెచ్చరించింది."బద్రం, బద్రం, జాగ్రత్తగా వెళ్ళు నాయనా! వెళ్ళిందే జాబు రాస్తావుగదూ? నీ దగ్గర రాగులపాడు అడ్రసుందో, లేదో?"

"ఉందండీ, రాజయ్య మేష్టారునడిగి రాసుకొన్నాను" అన్నాడు రవిబాబు.

బస్సు కదిలింది. రవిబాబు కిటికీలోనుంచీ చెయ్యి ఊపాడు. యాభై అరవైహస్తాలు పైకిలేచి గాలిలో కదిలాయి.

బస్సు అంతకంతకూ రాగులపాడుకు దూరంగా వెళ్ళిపోతోంది. తన పంచప్రాణాల్లో కొన్నింటిని అక్కడే దిగ విడిచినట్టు రవిబాబు మనసులో ఒక నిర్వేదం పొగమంచులా వ్యాపించింది. భౌతిక వనరుల విషయంలో భగవంతుడు వీళ్ళను చిన్నచూపు చూశాడు. సిరిసంపదలకు నోచుకోకపోయినా వీళ్ళలో మంచితనానికి, మమకారాలకు కొదువలేదు. జయాపజయాల మాట కేముందిగానీ, వీళ్ళు వీరోచితంగా పరిస్థితులతో పోరాడుతూనే ఉన్నారు. ఈ పోరాటంలో ఏ అదృష్టవంతుడైనా విజయం పొందేటట్టుగా తోస్తే, అలాంటివాణ్ణి కలిమి గలిగిన కామందులు గద్దల్లా వచ్చి తమ గూళ్ళలోకి తన్నుకుపోతున్నారు. అలా వేరుపడిన జన సమూహంలో నుంచి తమకు నచ్చిన వాళ్ళనీ, కావలసిన వాళ్ళనీ సంపన్న దేశాల వాళ్ళు తమ సరసకు చేరదీసుకుంటున్నారు. అదంతా ఒక విజేతల వర్గం. విజేతలైన వారికి పరాజితులపట్ల ఇసుమంతైనా సానుభూతి ఉండటం లేదు. ప్రేమ, త్యాగం, మమకారం, ఆత్మీయత మొదలైనవి వాళ్ళపాలిటికి అర్థహీనమైన పదాలుగా తోస్తాయి. స్వార్థమే వాళ్ళ జీవితానికి పరమార్థమైపోతుంది. సంగ్రహంగా ఇది ఈనాటి సామాజిక చరిత్ర అయి ఉండాలి...

అంతేనా ? తాను కూడా అంతేనా?

ఈ ప్రశ్నకు సమాధానం ఆశిస్తూ రవిబాబు తన గుండె మీద చేయివేసుకున్నాడు. ఆ గుండె ఏమని చెప్పిందో, అతనేం విన్నాడో ఎవరికి తెలుసు?

❄

ఆంధ్రప్రభ వారపత్రిక, 1986

కథా నిలయం
శ్రీకాకుళం